సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



కంచె సమీపంలో తవ్వకాలు

ఎస్ఎల్‌బీసీలో పైకప్పు కూలిన ప్రదేశంలో సహాయక చర్యలు వేగవంతమయ్యాయి.

వివరాలు 8లో ▸



కల్యాణం చూతము రారండి

సిర్సనగండ్లలో శనివారం మాసకల్యాణం వైభవంగా వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.8 /20.7

మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ సీతాదయాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దమగ్నాపురంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం రేషన్ లబ్ధిదారుల ఇంట్లో సన్నబియ్యం వండించి భోజనం చేశారు. జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతాదయాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, పశాంత్‌కుమార్, కథలప్ప, సురేందర్‌రెడ్డి, వట్టెం శివ, రవికుమార్‌గౌడ్ ఉన్నారు.

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలోని హన్వాడ, కొకుంట్ల, మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్, మిడ్జిల్ మండలాల్లో ఖాళీగా ఏర్పడిన ఆరు రేషన్ డీలర్ భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యావంతులైన నిరుద్యోగులు 18–40 ఏళ్ల మధ్య వయసు గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ప్రభుత్వ పని దినాలలో సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అయితే రిజర్వేషన్ల ప్రకారం చూస్తే హన్వాడ మండలం గొండ్యాల–2 బీసీ–ఈ, చిన్నదర్పల్లి బీసీ–ఈ, కొకుంట్ల మండలం అప్పంపల్లి బీసీ, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం అస్లాంఖాన్ స్ట్రీట్ ఓసీ, మహబూబ్‌నగర్ రూరల్ మండలం ఫతేపూర్ఎస్టీ, మిడ్జిల్ మండలం సింగందొడ్డి ఓసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో ఇప్పటి వరకు ఉగాది, రంజాన్ పండుగలు ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవడం జరిగిందని, రాబోయే అన్ని మతాల పండుగలను అదే పద్ధతిలో జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో అన్ని మతాల పెద్దలతో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మతాల మధ్యన స్నేహభావం పెంపొందించి శాంతి భద్రతలను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సంఘంలో సమగ్ర అభివృద్ధికి శాంతి అవసరమని, పోలీస్‌శాఖ ఎప్పుడూ ప్రజల కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. సీఐలు ఇజాజుద్దీన్, అప్పయ్య పాల్గొన్నారు.

ఇసుక మాఫియా ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలోని మూసాపేట మండలంలో ఇసుక మాఫియా చేస్తున్న ఆగడాలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ల సంఘం నాయకుడు ఘన్సిరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ, టీఎన్‌జీఓ, టీజీఓ, తహసీల్దార్ల సంఘం, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మూసాపేట తహసీల్దార్ రాజు నాయక్, కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న రికార్డ్ అసిస్టెంట్‌పైన అనుచిత వ్యాఖ్యలు చేసి దుర్భాషలాడిన ఇసుక మాఫియా నాయకుడిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి సంఘటనలు జరిగితే విధులు నిర్వహించలేని పరిస్థితి ఉంటుందన్నారు. ఇలాంటి వాటిని మొగ్గలోని తొలగించాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో టీజీఓ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి వరప్రసాద్, టీజీఎస్‌పీఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, దేవేందర్, చైతన్య, సుదర్శన్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ క్రేజీ

ఇండో టర్ఫ్‌లకు పాలమూరులో పెరుగుతున్న ఆదరణ

కొంచెం ఖాళీ సమయం దొరికిందంటే చాలు.. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ గల్లీ క్రికెటర్లుగా మారిపోతుంటారు. పెద్దపెద్ద పట్టణాల్లో సరైన మైదానాలు లేకపోవడంతో అక్కడక్కడ ఉన్న ఒకే గ్రౌండ్‌లో మూడు, నాలుగు టీంలు సర్దుకుపోతూ సరదాగా క్రికెట్ ఆడేస్తున్నారు. అయితే ఈ సమస్యకు 'బాక్స్ క్రికెట్' పరిష్కారం చూపుతోంది. ఇప్పుడు గల్లీ క్రికెట్ బాక్స్ క్రికెట్‌గా మారుతోంది. గతంలో నగరాలకు పరిమితమైన ఇండో టర్ఫ్‌లు ఇప్పుడు పట్టణాలకు కూడా వచ్చేశాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో ఆడే అవకాశం ఉండడంతో బాక్స్ క్రికెట్‌పై రోజురోజుకు క్రేజీ పెరుగుతోంది.



మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ కోర్టు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 వరకు కోర్టులు
- రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో క్రికెట్ ఆడే సౌలభ్యం
- వసతులను బట్టి చార్జీలు వసూలు చేస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్ తరహాలో ఉమ్మడి పాలమూరులో క్రీడాభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఆటల్లో వినూత్నంగా, వినోదభరితంగా ఉండేలా బాక్స్ క్రికెట్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో 12, నాగర్‌కర్నూల్‌లో రెండు, గద్వాల జిల్లాకేంద్రంలో ఒక బాక్స్ క్రికెట్ కోర్టులు ఏర్పాటు చేయడంతో.. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నా పెద్ద తేడా లేకుండా అన్ని వయసుల వారు అక్కడ క్రికెట్ ఆడుతూ సందడి చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆడడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పట్టణ ప్రజలకు వినోదభరితంగా ఉండేలా బాక్స్ క్రికెట్‌ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద పట్టణాలకే పరిమితమైన బాక్స్ క్రికెట్‌ను కొంతమంది యువత ఇప్పుడు చిన్నచిన్న పట్టణాలలో కూడా ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు.

సండే స్పెషల్

బాక్స్ క్రికెట్ విశేషాలు...

చిన్నపాటి కోర్టులో(పొడవు 25–30 మీటర్లు, వెడల్పు15 మీటర్లు, ఎత్తు 12 మీటర్లు) కాంక్రీట్ బెడ్, గ్రీనరీ టర్ఫ్ మ్యాట్ ఏర్పాటు చేశారు. పిచ్‌కు నాలుగు వైపులా నెట్, చుట్టూ సరిపడా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో బాక్స్ క్రికెట్ కోర్టు నిర్మాణానికి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. బాక్స్ క్రికెట్‌లో వసతులను బట్టి గంటలకు రూ.500 నుంచి రూ.600 వరకు చార్జ్ చేస్తున్నారు. వీకెండ్స్, సెలవు రోజుల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. బాక్స్ క్రికెట్ ఆడడానికి ముందస్తు బుకింగ్స్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఎక్కువ మంది కలిసి ఆడడం వల్ల అందరూ తలాకొంత వేసుకొని చెల్లించడంతో ఆడే వారికి పెద్దగా భారం అనిపించదు.

పెరుగుతున్న ఆదరణ



రెండేళ్ల క్రితం బాక్స్ క్రికెట్ కోర్టును ఏర్పాటు చేశాం. మొదట్లో కొన్ని నెలలు చాలా తక్కువ మంది వచ్చేవారు. ఆరేడు నెలలుగా బాక్స్ క్రికెట్‌కు మంచి స్పందన ఉంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ వచ్చి ఆడేందుకు ఇష్టపడుతున్నారు. వేసవిలో, వీకెండ్స్ సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తున్నారు.

– షేక్ వజాహత్ అలీ, బ్రదర్ హుడ్ బాక్స్ క్రికెట్ ఏరినా, నిర్వాహకుడు

వారంలో ఒకసారి క్రికెట్ ఆడుతా..



చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. రాజకీయాల్లో ఉన్నప్పటి నుంచి క్రికెట్ ఆడడానికి తీరిక లేకుండా పోయింది. అయితే జిల్లాకేంద్రంలో బాక్స్ క్రికెట్ కోర్టు ఏర్పాటు చేసినప్పటి నుంచి సమయం చూసుకొని క్రికెట్ ఆడుతాను. ఫిట్‌నెస్ కోసం వారంలో ఒకసారి బాక్స్ క్రికెట్ ఆడుతా.

– ఇంతియాజ్ ఇసాక్, రాష్ట్ర ఎంఎఫ్‌సీ మాజీ చైర్మన్, మహబూబ్‌నగర్

ఫిట్‌నెస్ కోసం..



ఫిట్‌నెస్ కోసం స్నేహితులతో కలిసి బాక్స్ క్రికెట్ ఆడుతాం. ఏడాదిన్నర నుంచి వీకెండ్స్, సెలవుల్లో బాక్స్ క్రికెట్ ఆడుతాం. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బాక్స్ క్రికెట్‌లో ఆడుతుంటే చాలా సరదాగా ఉంటుంది. పని ఒత్తిడి ఉండే మాకు ఈ బాక్స్ క్రికెట్ ఆడితే ఒక ప్రశాంతమైన అనుభూతి కలుగుతుంది.

– రాజేష్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి, మహబూబ్‌నగర్

సౌకర్యంగా ఉంది..



స్నేహితుల మధ్య అనుబంధానికి బాక్స్ క్రికెట్ ఒక వేదికలా నిలుస్తుంది. ఎంత బిజీగా ఉన్న వారంలో రెండుసార్లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బాక్స్ క్రికెట్ ఆడుతాం. చిన్నపాటి మైదానంలో ఎక్కువ దూరం పరుగెత్తాల్సిన అవసరం ఉండదు. బ్యాటింగ్, బౌలింగ్ చేయడానికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అందువల్ల బాక్స్ క్రికెట్ ఆడటానికి నేను ఎక్కువ ఆసక్తి కనబరుస్తాను.

– ఎండీ రియాజ్, ఐటీ ఉద్యోగి, మహబూబ్‌నగర్



యువత సందడి

రెండేళ్ల నుంచి బాక్స్ క్రికెట్‌కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. బాక్స్‌లో ఎదురుగా ఉన్న నెట్‌ను నేరుగా వెళ్లి తాకితే సిక్స్, స్టెప్పులు పడుతూ తాకితే బౌండరీ, పైకప్పుకు తగిలితే ఔట్, సింగిల్స్, డబుల్స్, రనౌట్లు, క్యాచ్‌లు అన్ని సేమ్ టు సేమ్‌గా ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు బాక్స్ క్రికెట్ అందుబాటులో ఉంటున్నాయి. అయితే చాలా మంది రాత్రివేళ్లలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆడడానికి ఇష్టపడుతున్నారు. వినూత్నంగా ఉండడంతో యువత ఎక్కువ సందడి చేస్తున్నారు. వీకెండ్ సెలవుల్లో బాక్స్ క్రికెట్ కోర్టులు చాలా బిజీగా ఉంటున్నాయి. మహబూబ్‌నగర్‌లో కొన్నిసార్లు బాక్స్ క్రికెట్ కోర్టులో టోర్నమెంట్లు సైతం నిర్వహిస్తుండడం విశేషం. క్రికెట్‌లో రాణించాలనుకునే చిన్నారులు కూడా బాక్స్ క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

తాగునీటి వృథాను అరికట్టలేరా?

- అసలే వేసవి కాలం.. వినియోగం అధికం
- నగరంలో రెండు రోజులకోసారి సరఫరా
- ఎక్కడబడితే అక్కడ పైపులైన్ లీకేజీలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని వివిధ ప్రాంతాల్లో తాగునీరు వృథాగా రోడ్లపై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒకవైపు పలు చోట్ల పైపులైన్, గేట్‌వాల్వ్‌ల వద్ద లీకేజీలు ఉన్నా మున్సిపల్ అధికారులు మరమ్మతు చేయించడం లేదు. మరోవైపు కొందరు ఇంటి యజమానులు తమ అవసరాలకు సరిపడా వాడుకున్నాక నల్లాలను బంద్ చేయకుండా పైపులతో ఆవరణలను కడగడం, మోరీలలో వదలడం వంటి పనుల కారణంగా వృథా అవుతోంది. వాస్తవానికి జిల్లా కేంద్రంలో రెండు రోజుల కోసారి మొత్తం 28 ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. అసలే వేసవికాలం కావడంతో వినియోగం అధికంగా ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో సుమారు గంట పాటు, మరికొన్ని ప్రాంతాల్లో అరగంట మాత్రమే అందుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.

నగరంలో ఇదీ పరిస్థితి..

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల పరిధిలో 3,36,647 మంది జనాభా ఉన్నారు. అందరికీ కలిపి తాగునీరు కనీసం 40 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) అవసరం. అయితే ప్రస్తుతం 33.5 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతోంది. ఇక ఒక్కొక్కరికి కనీసం 135 ఎల్‌పీసీడీ (లీటర్ పర్ కెపాసిటీ డైలీ) నీరు అవసరం. కాగా, మిషన్ భగీరథ పథకం ద్వారా 100 ఎల్‌పీసీడీ మాత్రమే అందుతోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ తాగునీటిని పట్టుకున్నాక చాలా వరకు ఇంటి యజమానులు తమ ఆవరణను శుభ్రం చేసేందుకని, వాహనాలు కడగడానికి పైపులతో వృథాగా వదులుతున్నారు. ఇది కాస్తా రోడ్ల వెంట ఏరులై పారుతూ ఇతరులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దాదాపు అన్ని గల్లీలలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. మరోవైపు వివిధ చోట్ల పైపులైన్లు, గేట్‌వాల్వ్‌ల వద్ద లీకేజీలున్నా మున్సిపల్ అధికారులు మరమ్మతు చేసిన దాఖలాలు లేవు.



పద్మావతికాలనీ రోడ్డుపై వృథాగా పారుతున్న మిషన్ భగీరథ పథకం తాగునీరు

ముఖ్యంగా జడ్చర్ల–రాయచూర్ రోడ్డు (ఎన్‌హెచ్–167)పై డిస్లేరిగడ్డ (హనుమాన్‌పురా) వద్ద, హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో, న్యూటౌన్‌చౌరస్తాలో, జీజీహెచ్‌కు ఎదురుగా, మెట్టుగడ్డ వద్ద, అలాగే తెలంగాణ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు రెండు చోట్ల, కలెక్టర్‌బంగ్లా చౌరస్తా నుంచి బోయపల్లిగేట్ (నవాబుపేట రోడ్డు వెంట) మోతీనగర్ వరకు మూడు చోట్ల, పద్మావతికాలనీలోని ఓ ఫంక్షన్ హాలు వద్ద, భూత్పూర్ రోడ్డులో మైత్రీనగర్ వద్ద లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో ఈ ప్రాంతాల్లో రోడ్ల వెంట తాగునీరు వృథాగా పారుతోంది.

ప్రెషర్ తక్కువగా వస్తుంది..



మా వీధికి నాలుగైదు రోజులకోసారి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు వదులుతున్నారు. ఈ ప్రాంతం ఎత్తుగా ఉన్నందున ప్రెషర్ తక్కువగా వస్తుండటంతో సరిపోవడం లేదు. సీడబ్ల్యూసీ గోదాం చౌరస్తా నుంచి బోయపల్లి రోడ్డులో కొన్ని చోట్ల నల్లాలకు ఆన్‌ఆఫ్ లేకపోవడంతో వృథాగా పోతోంది. ఇక్కడి మెకానిక్ షాపు వద్ద పైపు లీకేజీ ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– కిశోర్‌కుమార్, మోతీనగర్

రోడ్డు వెంట వృథా అవుతోంది



మా కాలనీలోని మహేంద్రనగర్ వైపు వెళ్లే మార్గంలో గేట్‌వాల్వ్ వద్ద కొన్ని నెలలుగా లీకేజీ ఉన్నా మున్సిపల్ సిబ్బంది మరమ్మతు చేయడం లేదు. దీంతో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు వదిలినప్పుడు కొన్ని గంటల పాటు సుమారు 200 మీటర్ల వరకు రోడ్డు వెంట వృథాగా పారుతోంది. ముఖ్యంగా బైక్‌లు, కార్లు వెళ్తున్నప్పుడు ఈ నీరు మొత్తం పాదచారులపై పడుతోంది.

– పగడం మల్లేష్, పద్మావతికాలనీ

లీకేజీలను సరి చేయిస్తాం



క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు త్వరలో నే మా సిబ్బందిని పంపిస్తాం. నగరంలోని ఆయా ప్రాంతాల్లో పైపులైన్, గేట్‌వాల్వ్‌ల వద్ద ఏర్పడిన లీకేజీలను వీలైనంత వరకు సరి చేయిస్తాం. ఇక మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని ఎవరూ వృథా చేయొద్దు. ఇళ్లలో అవసరమైన మేరకు పట్టుకుని ఆ వెంటనే నల్లాలను బంద్ చేసుకోవాలి. అప్పుడే ఇతరులకు సక్రమంగా చేరుతుంది.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మహబూబ్‌నగర్

మహనీయుల ఆశయసాధనకు కృషి



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆయా శాఖల జిల్లా అధికారులు

- బాబు జగ్జీవన్‌రాంను ఆదర్శంగా తీసుకోవాలి
- కలెక్టర్ విజయేందిర బోయి
- తెలంగాణచౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహనీయుల ఆశయసాధనకు కృషిచేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం బాబు జగ్జీవన్‌రాం 118వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ చౌరస్తాలో ఎస్పీ డి.జానకి, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్‌లతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగ్జీవన్‌రాం కేంద్ర మంత్రిగా కార్మిక, రవాణా, ఆహార, వ్యవసాయ, రక్షణ, రైల్వే శాఖ, భారత ఉప ప్రధానిగా కీలక పదవులు నిర్వహించారన్నారు. ఎస్సీ కుల సంఘాలు నాయకులు సమావేశంలో తెలిపిన సమస్యలను ఎస్పీ, జిల్లా యంత్రాంగం ద్వారా పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. విద్యార్థులు జగ్జీవన్‌రాం, మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని వారి జీవిత చరిత్రలు, సాహిత్యం, మంచి పుస్తకాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.

సమాజ నిర్మాణానికి కృషి...

బాబు జగ్జీవన్‌రాం సమ సమాజ నిర్మాణానికి కృషి చేసిన సామాజిక విప్లవ నాయకుడు అని రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగ్జీవన్‌రాం అడుగుజాడల్లో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, పీసీసీ కార్యదర్శి వినోద్‌కుమార్, సంజీవ్ ముదిరాజ్, మంత్రి నరసింహయ్య, మల్లెపోగు శ్రీనివాస్, నరసింహులు, గోపాల్‌మాదిగ, శామ్యూల్, లక్ష్మణ్, కుర్మయ్య, యాదయ్య, డీఆర్డీఓ నర్సింహులు, షెడ్యూల్ కులాల సేవా సహకార సంస్థ ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివద్ధి అధికారి సుదర్శన్, ఆర్‌డీఓ నవీన్ పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్
- ముగిసిన 12వ జిల్లా మహాసభలు



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్

మహబూబ్ నగర్ న్యూటౌన్: కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ఎన్‌డీఏ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుతామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ 12వ జిల్లా మహాసభలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ మోదీ సర్కార్ రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ ద్వారా కల్పించబడిన చట్టబద్ధ హక్కులను హరిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మిక కర్షక ఫాసిస్ట్ విధానాలపై మే రెండో వారంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తున్నామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను చిన్న చూపు చూస్తే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబ్నగర్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భాగి కృష్ణయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్గా కోట కదిర నరసింహ, జిల్లా ప్రధానకార్యదర్శిగా పి.సురేష్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా ఆంజనేయులు, కోశాధికారిగా ఎం.మధుసూదన్ రెడ్డి. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులుగా అమరజ్యోతి, బి.చెన్నయ్య, రంగన్న, పద్మ, జిల్లా సహాయ కార్యదర్శులుగా జి.మొగులన్న, దేవానంద్, జే.నరసింహ, యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నరసింహ, గోపాల్నాయక్, సాయి ప్రకాష్, శ్రీనివాసులు, రాములు, నరసింహ, ఆంజనేయులు, హరితో పాటు మరో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం



టీచర్స్‌కాలనీలోని రామాలయం



దేవతామూర్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీరామ నవమి పురస్కరించుకొని ఆదివారం జిల్లాకేంద్రంలో సీతారామ కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయాలతో పాటు పలు వీధుల్లో కల్యాణ వేడుకలు జరగనున్నాయి. లక్ష్మీనగర్‌కాలనీలోనిల శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం, న్యూగంజ్‌లోగల శ్రీలక్ష్మినరసింహస్వామి దేవాలయం, బస్టాండ్ సమీపంలోని ద్వారకామాయి షిరిడీసాయి ఆలయం, టీచర్స్ కాలనీ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం (రామాలయం), రామమందిరం, తూర్పుకమాన్ వద్దనున్న సీతారామాంజనేయస్వామి దేవాలయం, శ్రీనివాస కాలనీలోని పంచముఖాంజనేయస్వామి దేవాలయం, టీడీ గుట్ట తిరుమలనాథస్వామి ఆలయం, గణేష్‌నగర్‌లోని షిరిడీసాయిబాబా దేవాలయం, రామాంజనేయ స్వామి ఆలయం, సంజయ్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి ఆలయం, బాలాజీనగర్, నాగేంద్రనగర్, న్యూమోతీనగర్ ఆంజనేయాలయాల్లో, బీకే రెడ్డి కాలనీలోని శివాంజనేయస్వామి ఆలయం, వెంకటేశ్వరకాలనీ హయగ్రీవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

నిర్మాణంలో ఉన్న రోడ్డుపై పడి వ్యక్తి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

గట్టు: దారితప్పి వచ్చిన ఓ వ్యక్తి నిర్మాణంలో ఉన్న భారత్ మాల రోడ్డుపై పడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కర్ణాటకలోని యరగెరకు చెందిన వికలాంగుడు కర్లీ శ్రీనివాసులు(55) శుక్రవారం గద్వాలలో శుభకార్యానికి హాజరై సాయంత్రం ఆరగిద్దలో ఉన్న కూతురికి దగ్గరకు బయలుదేరాడు. మూడు చక్రాల ద్విచక్రవాహనంపై తాటికుంట, తప్పెట్లమొర్సు మీదుగా ఆరగిద్దకు వెళ్తుండగా.. గొర్లఖాన్‌దొడ్డి– ఆరగిద్ద గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న భారత్‌మాల రోడ్డుపైకి దారి తప్పి వెళ్లాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత అదుపు తప్పి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు శ్రీనివాసులు మొబైల్ ఫోన్‌లోని కాల్ లిస్టు ఆధారంగా ఆరగిద్దకు చెందిన కూతురు, అల్లుడికి సమాచారం అందించారు. ఆరగిద్ద గ్రామస్తుల సహకారంతో 108లో గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లగా అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాసులుకు భార్య లక్ష్మితోపాటు నలుగురు కుమార్తెలున్నారు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు గట్టు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

గద్వాల క్రైం: తల్లిదండ్రులు మందలించడంతో కుమారుడు ఉరేసుకొని మృతిచెందిన ఘటన శనివారం ఉదయం మండలంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ కథనం మేరకు.. మండలంలోని చేనుగోనిపల్లికి చెందిన ఖాజా (20) హైదరాబాద్‌లో ఓ ప్రవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. రంజాన్ పండుగకు గ్రామానికి వచ్చి తిరిగి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి దౌలత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

బస్సు ఎక్కబోయిన మహిళకు తీవ్ర గాయాలు

మహమ్మదాబాద్: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు ఎక్కబోయిన మహిళ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని జూలపల్లికి చెందిన సత్యమ్మ(48) తన కూతురు రాధికతో కలిసి శనివారం జంటిపల్లిలో జరిగే రామస్వామి ఉత్సవాలకు వెళ్లేందుకు బయలు దేరింది. సాయంత్రం నంచర్ల బస్టాండుకు చేరుకున్న వారు బస్సు కోసం చాలాసేపు వేచి చూశారు. ఎట్టకేలకు వచ్చిన బస్సు రద్దీగా ఉండటంతో ముందుగా కూతురు రాధిక బస్స ఎక్కింది. తల్లి సత్యమ్మ బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడపడటంతో ఆమె అదుపు తప్పి కిందపడింది. ప్రయాణికులు కేకలు వేయడంతో డ్రైవర్ బస్సు నిలిపివేశాడు. దీంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్సు అక్కడికి చేరుకొని ఆమెను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఫోన్‌పే నుంచి నగదు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌పే నుంచి నగదును చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాలు.. మండలంలోని వెంకటాపూర్‌కి చెందిన బాషమోని భాస్కర్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ఈనెల 4న హైదరాబాద్‌లో మిర్చి విక్రయించేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఫోన్ పడిపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి భాస్కర్ ఫోన్ ద్వారా ఫోన్‌పే నుంచి రూ.లక్షను విడతల వారీగా చోరీ చేశాడు. బాధితుడు బ్యాంక్ అకౌంట్‌ను చెక్ చేసుకోవడంతో నగదు చోరీ జరిగినట్లు గుర్తించాడు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థి కిడ్నాప్‌నకు యత్నం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్‌నకు ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించి సీఐ రవీందర్ కథనం ప్రకారం... శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో హాస్టల్ బయట ఉన్న 8వ తరగతి చదువుతున్న మహేష్‌ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుని వెళ్లారు. తోటి విద్యార్థులు విషయాన్ని హాస్టల్ వార్డెన్‌కు చెప్పడంతో సిబ్బందితో పట్టణంలో వెతికారు. పట్టణంలోని లింగాల రోడ్డులో విద్యార్థిని గమనించి వెంటనే హాస్టల్‌కు తీసుకొచ్చారు. శనివారం ఉదయం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించి హాస్టల్ వద్దకు పిలిపించారు. ఈ ఘటనపై విద్యార్థి తండ్రి కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విద్యార్థితో గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించారని, వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కల్యాణం చూతము రారండి


మాస కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సిర్సనగండ్లలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

- నేడు సీతారాముల కల్యాణ వేడుక
- మొదటిరోజు ముగిసిన మాస కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

చారకొండ: అపర భద్రాద్రి సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సిర్సనగండ్ల నుంచి భక్తులు, గ్రామస్తులు ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా గుట్టపైనున్న ఆలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సీతారాముల మాస కల్యాణం ప్రారంభం కాగా.. ఈ వేడుక 3 గంటలపాటు అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ కొనసాగింది. వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకను తిలకించారు.


హాజరైన భక్తులు

ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి దంపతులు, మాజీ ఎంపీ రాములు, తహసీల్దార్ సునీత దంపతులు, బీజేపీ నాయకులు భరత్‌ప్రసాద్, మండల నాయకులు వెంకట్‌గౌడ్, బాల్‌రాంగౌడ్, కల్లు సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సందీప్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కల్యాణం

కల్యాణ వేడుకకు సర్వం సిద్ధం..

శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణ వేడుకను కనులపండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రభుత్వం తరుపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించనున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి వేడుకలో పాల్గొననున్నారు. వేడుకకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలువ పందిళ్లు, అవసరమైన చోట టెంట్లు, నీటివసతి, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే కల్యాణ మండపం ఎదురుగా సుమారు 10 వేల మంది భక్తులు కూర్చొనేలా, కల్యాణ మండపం చుట్టూ 20 వేల మంది భక్తులు తిలకించేలా ఏర్పాట్లు చేశారు. వీఐపీల వాహనాల పార్కింగ్‌కు గుట్టపై స్థలాలు చదును చేశారు. వృద్ధులు, మెట్లపై నుంచి రాలేని వారి కోసం ఆలయం ఆధ్వర్యంలో గుట్టపైకి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చైర్మన్ ధేరం రామశర్మ చెప్పారు.

అనంతరం భక్తులకు సిర్సనగండ్లకు చెందిన పిన్నపురెడ్డి వెంకట్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణ్‌శర్మ, వేణుశర్మ, మురళీధర్‌శర్మ, కోదండరామశర్మ, రఘుశర్మ తదితరులు పాల్గొన్నారు.

గట్టి బందోబస్తు..

ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 17 మంది ఎస్‌ఐలు, 350 పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆలయ ఆవరణలో 22 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సమావేశంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ శంషోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

శ్రీరామా.. నీ నామం ఎంతో రుచిరా

- 15,116 బియ్యపు గింజలపై రామనామం
- అయోధ్య, భద్రాచలం ఉత్సావాలకు అక్షింతలు


శ్రీరామ నామాలు రాస్తున్న ఇల్లూరి శ్రీలక్ష్మి


బియ్యపు గింజలపై రాసిన 'శ్రీరామ' నామం

గద్వాల టౌన్: పుస్తకాల్లో రామ కోటి రాయాలంటేనే ఎంతో ఓపిక కావాలి.. కానీ, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన భక్తురాలు ఇల్లూరి శ్రీలక్ష్మి బియ్యపు గింజలపై శ్రీనామ నామం రాస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. పట్టణంలోని వెంకటరమణ కాలనీకి చెందిన ఇల్లూరి శ్రీలక్ష్మి 15,116 బియ్యపు గింజలపై జెల్ పెన్నుతో 'శ్రీరామ' అనే అక్షరాలు రాశారు. ఈ బియ్యపు గింజలలో అయోధ్యకు 5 వేలు, భద్రాచలానికి 3 వేలు, బీచుపల్లికి 5 వేలు, స్థానికంగా రామాలయాలకు 2 వేల బియ్యపు గింజలు అందజేశారు. రామనామం జపిస్తూ భక్తితో రాసిన ఈ బియ్యపు గింజలను ఆయా ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు అక్షింతలుగా పంపినట్లు పేర్కొన్నారు. 2015 నుంచి శ్రీరామ నామాలు రాస్తూ శ్రీరామ నవమి వేడుకలకు తలంబ్రాలుగా అందిస్తున్నారు. ఈమె గతంలోనూ మహాశివరాత్రి సందర్భంగా కూడా బియ్యపు గింజలపై ఓం నమఃశివాయ అనే పంచాక్షరి మంత్రం రాసి భక్తిని చాటుకున్నారు. ఇల్లూరి శ్రీలక్ష్మి భక్తిని జిల్లా ప్రజలు ప్రశంసిస్తున్నారు.

డబ్ల్యూఈపీఎల్ లీగ్‌కు గణేష్

- ఇంగ్లాండ్‌లో నాలుగు టోర్నీల్లో పాల్గొననున్న జిల్లా క్రీడాకారుడు
- 8న ఇంగ్లాండ్‌కు పయనం
- సన్మానించిన జితేందర్‌రెడ్డి, ఎండీసీఏ ప్రతినిధులు


గణేష్‌ను సన్మానిస్తున్న జితేందర్‌రెడ్డి, ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లా మరికల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన గణేష్ క్రికెట్‌లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నాడు. వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఈపీఎల్) ప్రేమ్ 2 డివిజన్, వరిష్ట చెల్టినహమ్ ప్రీమియర్ టీ-20, డబ్ల్యూఈపీఎల్ టీ-20, నేషనల్, కంట్రీకప్ టోర్నమెంట్‌ల్లో అతడు ఆడనున్నాడు. గణేష్ ప్రతిభను గుర్తించిన అక్కడి నిర్వాహకులు టోర్నీల్లో ఆడడానికి అవకాశం కల్పించారు. మంగళవారం ఇంగ్లాండ్‌కు బయలుదేరుతున్న అతడు ఆరునెలల పాటు అక్కడి క్రికెట్ పోటీల్లో పాల్గొననున్నాడు. డబ్ల్యూఈపీఎల్ క్రికెట్ టోర్నీలకు వెళ్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని గణేష్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

హెచ్‌సీఏ టోర్నీల్లో సత్తా

గణేష్ ఎండీసీఏ, హెచ్‌సీఏ క్రికెట్ అసోసియేషన్ టోర్నీల్లో సత్తా చాటుతున్నాడు. హెచ్‌సీఏ అండర్-16, అండర్-19, అండర్-23 జట్లకు పలుసార్లు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించాడు. హెచ్‌సీఏ కంబైన్ జిల్లా జట్టుకు ఎంపికై రాణించాడు. 2019–20లో హైదరాబాద్‌లో జరుగుతున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎ-2 డివిజన్ లీగ్ మ్యాచ్‌లో గణేష్ అద్భుతమైన బ్యాటింగ్‌తో తన అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేశాడు. రాజు క్రికెట్ క్లబ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గణేష్ ట్రిపుల్ సెంచరీ చేసి సీజన్‌లో తొలి ట్రిపుల్ సెంచరీ నమోదు చేశాడు. మ్యాచ్‌లో 200 బంతుల్లో 42 ఫోర్లు, 7 సిక్స్‌లతో 318 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇదే సీజన్‌లో మరో ట్రిపుల్ సెంచరీ (329పరుగులు) చేశాడు. జింఖానా మైదానంలో జరిగిన సీనియర్ జోనల్ క్రికెట్ టోర్నీలో కంబైన్ జట్టు తరపున రెండు మ్యాచుల్లో కలిపి 350 పరుగులు చేశాడు.

గణేష్‌కు సన్మానం

డబ్ల్యూఈపీఎల్ టోర్నీలకు వెళ్తున్న గణేష్‌ను హైదరాబాద్‌లో శనివారం రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు, ఎండీసీఏ అధ్యక్షులు ఏపీ జితేందర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరచి జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రతిష్ట తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు ఆబిద్ అలీ పాల్గొన్నారు.

కంచె సమీపంలో తవ్వకాలు


సొరంగం లోపల మినీ హిటాచీలతో చేపడుతున్న పనులు

- ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- 43 రోజులుగా చిక్కని కార్మికుల ఆచూకీ

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో పనులు వేగవంతమయ్యాయి. అధికారులు అదనంగా మరో మూడు ఎస్కవేటర్లు ఏర్పాటు చేసి పనులు చేపడుతున్నారు. సొరంగం లోపల కట్ చేసిన టీబీఎం భాగాలు, మట్టి, బురద, రాళ్లను బయటకు తరలిస్తున్నారు. కన్వేయర్ బెల్టు పనులు వంద మీటర్ల ముందుకు పొడిగించడంతో సొరంగంలో తవ్విన మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు పంపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 రకాల బృందాలు మూడు షిఫ్టుల్లో 24 గంటలపాటు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. కంచె ఏర్పాటు చేసిన నిషేధిత ప్రదేశం సమీపంలో సహాయక సిబ్బంది పనులు చేపడుతున్నారు. సొరంగం పైకప్పు కూలిన ప్రదేశం నుంచి భారీగా వస్తున్న నీటి ఊటను 150 హెచ్‌పీ మోటార్లతో 2.5 కిలోమీటర్లకు ఒకటి, రెండు ఏర్పాటు చేసి నీటిని బయటకు తోడేస్తున్నారు. నీటి పారుదల, జీఎస్‌ఐ అధికారులు నిరంతరం సొరంగం ప్రమాద ప్రదేశం వద్ద ఉంటూ తగిన సలహాలు, సూచనలు చేస్తున్నారు.

మట్టి తవ్వకాలు వేగవంతం

సొరంగం లోపల మట్టి తవ్వకాలు వేగవంతం చేశామని, వెంటిలేషన్ పనులు కొనసాగిస్తున్నామని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. శనివారం సొరంగం జేపీ కార్యాలయం వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించి సొరంగం లోపల చేపడుతున్న సహాయక చర్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీవాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, సొరంగంలో చిక్కుకున్న ఆరుగురి కోసం సహాయక సిబ్బంది నిర్విరామంగా గాలింపు చేస్తూ అనుమానిత ప్రదేశాల్లో తవ్వకాలు చేపడుతున్నారని వివరించారు. సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న అన్ని పరిస్థితులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు హక్కుల కోసం పోరాడాలి

టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం


మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

నారాయణపేట: కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మెట్రో గార్డెన్‌లో జరిగిన తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన రాష్ట్ర రెండో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడకుండా ఏ హక్కులు సాధించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదహారు నెలలు గడుస్తున్నా సమ్మె అప్పుడు కార్మికులను ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. నాయకులు హనుమేష్, అరుణ్ కుమార్, కిరణ్, నర్సిములు, కాశీనాథ్, ఎదిరింటి నర్సిములు, బోయిన్‌పల్లి రాము, వెంకట్ రాములు, సాంబశివుడు. ఎదుట్ల కుర్మయ్య, బోయిన్‌పల్లి గణేష్, చంద్రం, కృష్ణ, వెంకట్ ప్రసంగించారు. అనంతరం మెట్రో గార్డెన్ నుంచి కార్మిక ప్రదర్శన ప్రారంభమై అంబేడ్కర్ చౌక్, కొత్త బస్టాండ్ మీదుగా నర్సిరెడ్డి చౌక్‌కు చేరుకున్నారు.

రేపు హైందవ భక్తి కళా సమ్మేళనం


హైందవ భక్తి కళా సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామిజీ

మహబూబ్‌నగర్ రూరల్: సంకీర్తన సాంప్రదాయమే సనాతన ధర్మానికి ఊపిరనే లక్ష్యంతో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద హైందవ భక్త కళా సమ్మేళనం నిర్వహించనున్నామని.. భజన కళాకారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామిజీ కోరారు. శనివారం మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి పాలమూరు జిల్లా భజన కళాబృందం గురువులు, ప్రతినిధుల హరినామ సంకీర్తనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా యాదాద్రి లక్ష్మీ నారసింహ స్వామి ఆలయ సన్నిధిలో నిత్య అఖండ హరినామ సంకీర్తన జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో వేల సంఖ్యలో జానపద, భజన కళాబృందాలు, కళాకారులు ఉన్నారని.. హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. భజన గురువులకు గుర్తింపు కార్డులిచ్చి కళారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు, దేవాదాయశాఖ ముందుకురావాలని కోరారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల కళాకారులు రెండుగంటల పాటు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. సంకీర్తన అనంతరం స్వామివారిని దర్శించుకొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ సంకీర్తనలో పాల్గొన్న భజన గురువులను అభినందించారు. ప్రత్యేక దినాలు, ఉత్సవాల సమయంలో భజన గురువులు పాల్గొని హనుమద్దాసుని సంకీర్తన చేయాలని కోరారు. కార్యక్రమంలో హిందూ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ ప్రతినిధి మల్లికా వల్లభ, జై భారత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈద్‌మిలాప్‌తో సోదరభావం పెంపు


మాట్లాడుతున్న ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈద్‌మిలాప్‌లతో సోదరభావం పెంపొందుతుందని టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జమాతే ఇస్లామి హింద్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో స్థానిక అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి ఘనంగా ఈద్‌మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల్ మాట్లాడుతూ ఈద్‌మిలాప్ కార్యక్రమం మనలోని ఐక్యతను చాటుతుందన్నారు. రంజాన్ ఈదుల్ ఫితర్ పండుగ తర్వాత ఈద్‌మిలాప్ నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల నుంచి ఈద్‌మిలాప్ నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఎంపీజే తెలంగాణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, మౌలానా అబ్దుల్ నాసర్ మజహరి తదితరులు ప్రసంచి ఈద్ మిలాప్ ప్రాముఖ్యతను వివరించారు.

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో బీసీల స్థానం ఎక్కడ?


మాట్లాడుతున్న బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో బీసీలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం దక్కడం లేదని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. స్థానిక బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టుల విషయంలో ఇప్పటివరకు బీసీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ నియోజకవర్గాల నుంచి అగ్రవర్ణాల వారే కార్పొరేషన్ చైర్మన్లుగా ఉన్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో బీసీల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో బీసీలు దాదాపు 65 శాతం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ బీసీలను పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలా మంది బీసీలకు కాస్త అయినా న్యాయం జరుగుతుందని భావించిన బీసీ సమాజానికి అన్యాయమే జరిగిందన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగి లక్ష్మీకాంత్, నాయి బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు అశ్విని సత్యం, బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్ ఆంజనేయులు, నవీన్‌గౌడ్, భీమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల మద్దతు'


మాట్లాడుతున్న యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ యాదవ్

భూత్పూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలుపాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల తరుపున ప్రత్యేక ధన్యవాదాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దేవరకద్ర నియోజకవర్గస్థాయి యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాల్లో యాదవుల వాటా కోసం ఉద్యమిస్తామని, ఇందుకు వేదిక రాష్ట్రస్థాయిలో పని చేస్తుందని వివరించారు. జనాభాలో 10 నుంచి 15 శాతం ఉన్న అగ్రకులాలు ఈడబ్ల్యూఎస్ పేరున 10 శాతం రిజర్వేషన్లు తీసుకోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు వెంకటనర్సయ్య, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు అంజన్నయాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జుర్రు నారాయణ యాదవ్, బత్తుల మల్లేష్ యాదవ్, ఊషన్న యాదవ్, కృష్ణయ్య యాదవ్, రెడ్డికుంట వెంకటేష్ యాదవ్, చందు యాదవ్, నరేందర్ యాదవ్, మందడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ పెబ్బేరు టౌన్ నందు, కొల్లాపూర్ రోడ్డుకు 30x80 సైజు గల 3 రోడ్డులు కలిగిన కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును. సంప్ర: 99515 97247, 82476 17139

■ " independent House for Sale "184yds, 2BHK East Facing at Jedcharla M: 9886154400

WANTED

■ నెట్‌వర్క్ లీడర్స్, LIC ఏజెంట్స్ కావలెను. కేవలము 1680/- ఒకసారి పెట్టుబడితో సొంత వ్యాపారం ప్రారంభించి 3 వేలు-30వేలు సంపాదించండి. Ph: 9948208005

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899

FACULTY TEACHERS

■ WANTED TEACHERS Upanishad International School Kosgi, Narayanpet(D) Ph: 7989-417-503; 799-33-91279

సాక్షి భవిత విద్యార్థుల కోసం

సాక్షి ద్వారా మీ ఆత్మీయులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్